
ఈనాడు
epaper.eenadu.net

# మెట్రో- 2 భూసేకరణకు

# చిక్కులు తక్కువే

- పాతబస్తీలో ఆస్తుల సేకరణతోనే అత్యధికంగా కి.మీ. అంచనా వ్యయం
- రాయదుర్గం-కోకాపేట మార్గం ఖర్చు అత్యధికం

ఈనాడు, హైదరాబాద్ : మెట్రో రైలు రెండోదశలో పాతబస్తీ మార్గంలో మినహా మిగతా నాలుగు కారిడార్లలో పెద్దగా భూసేకరణ చిక్కులు లేవు. ఆయా కారిడార్ల నిర్మాణానికి పాతబస్తీ కంటే తక్కువ వ్యయమవుతుందని సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్)లో అంచనా వేసింది. సెంట్రల్ మీడియన్ మీదుగా నిర్మాణం చేపట్టేలా ప్రణాళిక రూపొందించారు. మెట్రో రెండోదశ మొదటి భాగంలో 76.4 కి.మీ. ప్రతిపాదించారు. రూ.24,269 కోట్లు వ్యయంగా అంచనా వేశారు. సగటున కిలోమీటర్ నిర్మాణానికి 317.65 కోట్లు అవుతుంది.



రెండోదశలో...

| | హైదరాబాద్ | బెంగళూరు | చెన్నై |
|---|---|---|---|
| మొత్తం కి.మీ. | 76.4 కి.మీ. | 75.0 కి.మీ. | 118.9 కి.మీ. |
| అంచనాలు | రూ.24,269 కోట్లు | రూ.40,000 కోట్లు | రూ.63,246 కోట్లు |
| సగటు కి.మీ. వ్యయం | రూ.317 కోట్లు | రూ.533 కోట్లు | రూ.531 కోట్లు |

**ఈ కారిడార్‌లోనే చిక్కులు:** ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట మార్గంలో **1400వరకు** ఆస్తులు సేకరణ, రహదారి విస్తరణ చేపట్టాలి. వీటికే రూ.800కోట్ల దాకా వ్యయమవుతుందని అంచనా. కి.మీ.కి రూ.365.46 కోట్లవుతుందని అంచనా వేశారు.

**అధిక ఖర్చు ఇక్కడే:** రాయదుర్గం-కోకాపేట నియో పోలీసు వరకు 11.6 కి.మీలకు వ్యయ అంచనా రూ.4318 కోట్లు. ఇక్కడ భూముల ధరలే కారణం. సగటున కి.మీ.నిర్మాణానికి రూ.372 కోట్లవుతుందన్నారు. రెండోదశలో అత్యధిక సగటు వ్యయం ఇదే.

*అత్యల్పం హయత్‌నగర్ మార్గంలో..* ఎల్బీనగర్ - హయత్‌నగర్ జాతీయ రహదారి మార్గంలో 7.1కి.మీ మెట్రోని ప్రతిపాదించారు. రూ.1877 కోట్లవుతుందని అంచనా వేశారు. సగటున కి.మీ.కు రూ.264 కోట్లు అవుతుంది. అన్ని కారిడార్ల కంటే అత్యల్ప వ్యయం ఇక్కడే.

### ఈ రెండు మార్గాల్లో...

నాగోల్‌నుంచి శంషాబాద్ విమానాశ్రయం వరకు 36.8 కి.మీ. ఉంటుంది. రూ.11,226 కోట్లు అవుతుందని అంచనా వేశారు. సగటున కి.మీ. మెట్రో నిర్మాణానికి ఇక్కడ వెచ్చించాల్సిన వ్యయం రూ.305 కోట్లు. పెద్దగా భూసేకరణ సమస్యలు లేవని అధికారులు చెప్పారు.

- మియాపూర్-పటాన్‌చెరు మార్గంలో 13.4 కి.మీ.కు గాను రూ.4107 కోట్లు అంచనా వేశారు. సగటు కి.మీ.కు రూ.306 కోట్లు.

### బెంగళూరు, చెన్నై కంటే తక్కువే

ప్రస్తుత మెట్రో రెండోదశ పనులు జరుగుతున్న బెంగళూరులో 75 కి.మీ.కు రూ.40వేల కోట్లు, చెన్నైలో 118.9 కి.మీ.కు రూ.63,246 కోట్లుగా అంచనా వేశారు. సగటున కి.మీ.కు రూ.531 నుంచి రూ.533 కోట్లు అవుతుంది. దీంతో పోలిస్తే చాలా తక్కువ వ్యయంతో హైదరాబాద్ మెట్రో-2 నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించామని అధికారులు చెబుతున్నారు. ఆప్టిమల్ డిజైన్‌తో అంచనా వ్యయాలు తగ్గించేలా జాగ్రత్త తీసుకున్నామన్నారు. నిర్మాణం సైతం వేగంగా పూర్తయ్యేలా చర్యలుంటాయని చెప్పారు.

Date : 04/11/2024 EditionName : GREATER HYDERABAD PageNo :